

మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : సమస్త మానావళి సంక్షేమమే లక్ష్యంగా మహమ్మద్ ప్రవక్త చేసిన బోధనలు నేటి సమాజానికి అనుసరణీయమని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా పేర్కొన్నారు. ప్రవక్త మహ్మద్ జన్మదిన మాసోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగరం అడైగర్ వీధిలో వైఎస్సార్‌సీపీ గల్ఫ్, ఎన్ఆర్ఐ ప్రతినిధులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అంజద్‌బాషాతో పాటు మేయర్ సురేష్‌బాబు, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ మహబూబ్‌పీర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంజద్‌బాషా మాట్లాడుతూ ప్రవక్త జన్మదిన మాసోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా అన్నదానాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 30 సంవత్సరాలుగా గల్ఫ్, ఎన్ఆర్ఐ ప్రతినిధులు ఈ ప్రాంతంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. అన్సర్‌బాషా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ మిత్ర బృందం నిర్వహించడంఅభినందనీయమని కొనియాడారు.


అన్నం వడ్డిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం

కృతజ్ఞతలు

వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ మాట్లాడుతూ దివంగత అన్సర్ బాషా సామాజిక సేవను కొనసాగిస్తూ గల్ఫ్ కువైట్, దుబాయి, సౌదీలో ఉండే మిత్రులు, స్థానిక గల్ఫ్ ఎన్ఆర్ఐ గ్రూప్ సభ్యుల సహకారంతో ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి సహకరించిన మిత్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ఆర్ఐ కడప గ్రూప్ సభ్యులు షేక్ గయాజ్, బాబుబాయి, షేక్ ఉస్మాన్, షౌకత్, జి. ప్రవీణ్‌కుమార్ రెడ్డి, అబ్దుల్ రౌఫ్, ఫైరోజ్, స్థానిక కార్పొరేటర్ షేక్ రఫీ, కార్పొరేటర్లు షంషీర్, బసవరాజు, అజ్మతుల్లా, రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి అలీ అక్బర్, స్థానికులు షేక్ అన్వర్, అలీమ్, జలీల్, రియాజ్, అఫ్సర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

తొలి తెలుగు రాజకీయ ఖైదీ 'గాడిచర్ల'

కడప ఎడ్యుకేషన్: గాడిచర్ల హరిసర్వోత్తమరావు సంపాదకీయాలు స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆంగ్ల ప్రభుత్వానికి చెంపపెట్టులా ఉండేవని సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి పేర్కొన్నారు. తన సంపాదకీయంలో ప్రభుత్వాన్ని పరుషంగా నిందించారనే నెపంతో జైలుకు పంపించారని, అలా ఆయన రాజకీయ ఖైదీ అయ్యారని తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు, పత్రికా సంపాదకులు, గ్రంథాలయ ఉద్యమ నాయకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 142వ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ గాడిచర్ల 1907లో స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించారని, రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతూ బిపిన్‌చంద్రపాల్ ఉపన్యాసాలతో ఉత్తేజితులై వందేమాతరం ఉద్యమానికి నాయకత్వం వహించారని గుర్తుచేశారు.


గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో గాడిచర్ల తన సంపాదకీయాల ద్వారా ప్రజల్లో స్ఫూర్తిని నింపారని కొనియాడారు. గాడిచర్ల పత్రికారంగంలోకి అడుగుపెట్టి 'స్వరాజ్య' అనే తెలుగు పత్రికను ప్రారంభించి ఆంగ్ల ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారని చెప్పారు. రచయిత కొత్తపల్లి రామాంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాడిచర్ల జైలులో చాలా దుర్భర జీవితాన్ని అనుభవించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు చంద్రశేఖర్, రంగా, వెంకట నగేశ్ పాల్గొన్నారు.

చెర్లోపల్లి సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరం శివారు ప్రాంతం చెర్లోపల్లి రహదారి, శ్మశానం, విద్యుత్, డ్రైనేజ్, మంచి నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలకు సన్నద్ధమవుతున్నట్టు ఆ పార్టీ నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెర్లోపల్లి లేఔట్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా రెవెన్యూ, హౌసింగ్ అధికారులు తమ పరిధిలో లేదని, కార్పొరేషన్ అధికారులు తమకు సంబంధించిన అంశం కాదని, హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యంతో వాయిదాలు వేస్తున్నారని తెలిపారు. కాలనీ ఏర్పడి 17 సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటివరకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఈనెల 15 నుంచి 21 వరకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి. దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు పి .చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, న్యాయవాది బాలసుబ్బయ్య పాల్గొన్నారు.

హిందీ భాష భారతీయుల వారసత్వ సంపద

కడప ఎడ్యుకేషన్: హిందీభాష భారతీయు వారసత్వ సంపద అని ప్రావిడెండ్ ఫండ్ రీజనల్ ఆఫీస్ జాయింట్ డైరెక్టర్ మహబూబ్‌బాషా అన్నారు. కడపలోని సీపీబ్రౌన్ గ్రంథాలయంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు కడపజిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు భారతీయను ఏకతాటిపై హిందీ భాషా నడిపించిందని తెలిపారు. రాష్ట్ర అదనపు కార్యదర్శి పద్మనాభయ్య మాట్లాడుతూ హిందీ ప్రచార, ప్రసార బాధ్యత హిందీ ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసురేష్, గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గంగిరెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శివారెడ్డి, వర ప్రసాద్‌రెడ్డి, జిలానీబాషా ప్రసంగించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆర్జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం కడప భుజంగరావు ఆర్జేయూపీ టీచర్స్ భవన్‌లో రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల నూతన వేతన సవరణ కమిటీ తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న డీఏ అరియర్స్, రిటైర్డ్ పెన్షనర్ల బకాయిలు, ప్రావిడెంట్ ఫండ్, సరెండర్ లీవు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం, జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు, టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, నాయకులు వీరయ్య, వీరన్న పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి

కడప సెవెన్‌రోడ్స్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా కడప నగరానికి చెందిన విజిల్ డాన్స్ అకాడమీ విద్యార్థులు పద్మాకర్ సహకారంతో ఆట-పాటలతో అలరించారు. సినీగీతాలు, జానపద పాటలకు చిన్నారుల నృత్యాలు ప్రదర్శించారు. జానపద గీతాలకు హావాభావాలతో చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

బీసీ రుణాల మంజూరు ఎప్పుడు?

కడప ఎడ్యుకేషన్: బీసీ నిరుద్యోగ యువకులు సబ్సిడీ రుణాల కోసం ఎదురు చూస్తున్నారని, ఎప్పుడు మంజూరు చేస్తారని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున ప్రశ్నించారు. ఆదివారం ఆయన కడపలో పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ, బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేశామని, ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ సబ్సిడీ రుణాల నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు.

ప్రజ్ఞా శిఖరం 'మోక్షగుండం'

– ఇంజినీర్ల దినోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆధునిక కాలంలో ఇంజినీరింగ్ వ్యవస్థకు ఎంత గొప్ప ప్రాధాన్యత ఉందో అందరికీ తెలిసిందే. మానవుడికి కనీస అవసరాలైన కూడు, గూడు, వస్త్రాలలో ఒకటైన గూడు (ఇల్లు) నిర్మాణంలో ఇంజినీర్లది ముఖ్యమైన పాత్ర. నివాస గృహాలైనా, కార్యాలయాలు, కర్మాగారాలైనా, చర్చిలు, మసీదులు, ఆలయాలు, చెక్‌డ్యాంలు, భారీ ప్రాజెక్టులు ఇంజినీర్ల ప్రతిభకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. మన దేశానికి చెందిన గొప్ప ఇంజినీరు, సాంకేతిక ప్రజ్ఞాశిఖరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన పుట్టిన రోజు సెప్టెంబరు 15ను ఇంజనీర్ల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాము. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన ఇంజినీర్లకు సాక్షి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తోంది.


మోక్షగుండం విశ్వేశ్వరయ్య

'మోక్షగుండం' జీవిత విశేషాలు

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సామాన్య కుటుంబంలో పుట్టి స్వయం కృషితో ఉన్నత స్థాయి సాంకేతిక ప్రజ్ఞామూర్తిగా పేరు గడించారు. సివిల్ నిర్మాణాలు, నీటిపారుదల, వరదల నివారణ కోసం ప్రత్యేక నిర్మాణాలు ఇలా ఎన్నో విశిష్టమైన కట్టడాల నిర్మాణంతో ఆయన ఇతర దేశాల సాంకేతిక నిపుణుల ప్రశంసలు పొందారు. 1816లో కర్ణాటకలో కోలార్ జిల్లాలో జన్మించిన మోక్షగుండం పూర్వీకులు ప్రకాశం జిల్లాకు చెందిన వారే. బెంగళూరు, పూణేలలో విద్యాభ్యాసం చేసి సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రతిభ చూపారు. ప్రత్యేకించి నీటిపారుదల నిర్మాణాలపై ప్రత్యేక అధ్యయనం చేసిన ఆయన ఆ రంగంలో సమకాలిన ఇంజినీర్ల కంటే ఎంతో ఉన్నత స్థానంలో నిలిచారు. 1908లో మైసూరు మహరాజ ఆయనను తమ రాష్ట్రంలోని రాజ్యసభ చీఫ్ ఇంజినీరుగా నియమించారు. ఆయన మార్గదర్శకత్వంలోనే కావేరి నదిపై కృష్ణరాజసాగర్‌ను నిర్మించారు. 1912లో మైసూరు దివాన్ అయ్యారు. కర్ణాటకలో ఆయనదైన నిర్మాణాలెన్నో నేటికీ అందరినీ ఆకర్శిస్తూ చెక్కుచెదరకుండా ఉన్నాయి.

మన ప్రాంతంలో..

జిల్లాలో బ్రిటీషు కాలం నాటి ఎన్నో భవనాలు నేటికి పటిష్ఠంగా నిలిచి ఉండటాన్ని గమనించవచ్చు. ప్రభుత్వ పురుషుల కళాశాల, కలెక్టర్ బంగ్లా, ఎస్పీ కార్యాలయం, బంగ్లా, పాత కలెక్టర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం నేటికి నాటి ఇంజనీర్ల ప్రతిభను చాటుతున్నాయి. జిల్లాలో 100 సంవత్సరాలు దాటినా పటిష్ఠంగా ఉన్న ఎన్నో చర్చి భవనాలను కూడా గమనించవచ్చు.

మోక్షగుండం ఆదర్శంగా..

తమ శాఖలో మేరు సమానులైన మోక్షగుండెం విశ్వేశ్వరయ్యపై గౌరవంతో కడప నగరంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక ఎల్ఐసీ సర్కిల్‌లో ఉన్న ఈ విగ్రహం వద్ద ప్రతి ఏడాది ఇంజినీర్ల దినోత్సవ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నారు. ఆయన పేరిట సమీపంలోనే ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

దూదేకుల సంక్షేమమే ధ్యేయం

కడప సెవెన్‌రోడ్స్ : దూదేకుల సంక్షేమమే ధ్యేయమనిదూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వీరభద్రుడు అన్నారు. ఇటీవల డైరెక్టర్‌గా నియమితులైన ఆయనను ఆదివారం కడప నగరం ఎర్రముక్కపల్లెలోని నూర్‌బాషా దూదేకుల భవన్‌లో ఘనంగా సత్కరించారు. నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గుటూరు చిన్నరాజ, కార్యదర్శి కేపీ హుసేన్, విశ్రాంత రిజిస్ట్రేషన్స్ స్టాంప్స్ డీజీ సులేమాన్, జిల్లా అధ్యక్షులు సుంకేసుల బాష, ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్ దృష్టి సారించాలి

కడప కార్పొరేషన్ : జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి కోరారు. ఆదివారం కడప నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీ కెనాల్‌తోపాటు బోర్ల కింద సాగు చేసిన వరి, మిగతా పంటలకు అవసరమైన యూరియా కొనేందుకు అధిక మొత్తంలో చెల్లించేందుకు సిద్ధమైనా మార్కెట్‌లో దొరకని పరిస్థితి నెలకొందన్నారు. ఓవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి మొదలుకొని అధికారుల వరకు ఎక్కడా కొరత లేదని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. చెన్నూరు ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, రాచిన్నాయపల్లె సర్పంచ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వైద్యరంగంలో ఫిజిషియన్స్‌కు ప్రత్యేకస్థానం

కడప అర్బన్: వైద్యరంగంలో ఫిజీషియన్స్‌కు ప్రత్యేక స్థానం ఉందనీ ఏపీ ఏపీకాన్ జాతీయస్థాయి చైర్మన్ డాక్టర్ జ్యోతిర్మయి పాల్ అన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఇండియా ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో కడప నగర శివార్లలో 'మాధవి కన్వెన్షన్'లో నిర్వహించారు. డాక్టర్ జ్యోతిర్మయి పాల్ మాట్లాడుతూ వైద్యరంగంలో జనరల్ మెడిసిన్ విభాగంలో ఫిజిషియన్‌లకు ఎప్పటికప్పుడు నూతన మార్పులు వస్తుంటాయన్నారు. ఏపీ ఏపీకాన్-2025 ఏపీ చాప్టర్ చైర్మన్ డాక్టర్ మనోజ్‌కుమార్, మునీశ్వర్‌రెడ్డి, డాక్టర్ యాదవేంద్రారెడ్డి, డాక్టర్ అర్జున్‌కుమార్, వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.